కథా నిలయం
శ్రీకాకుళం

# బుగతోడు - గూడుబండి

కారుమల్లె పొదలా, అంకుడు దొంకలా, అడ్డాకుల తీగలా దట్టంగా అల్లుకుపోయి పెండిలా వున్నాయి. ఆ గోర్జికి యిరుపైపులా! ఆ గోర్జిలోంచి 'గెడ్డాలస' వైపు గూడుబండి పరుగెడుతోంది. కోడెల్ని అదిలిస్తూ మొత్తామీద కూర్చున్నాడు బూగన్న!

బూగన్నకు పల్లపు భూమి రెండున్నర యకరాలు, మెట్టభూమి మూడెకరాలు వుంది. ఇద్దరు కొడుకులు. భూమీ పుట్రా, బండీ పశువులా కలిగిన సవర బూగన్న గెడ్డాలసకి సామంతు. బూగన్న మాటే గెడ్డాలస నడిచే బాట! బూగన్న మీద అంతగురి గెడ్డాలస ప్రజలకు!

గూడు బండిలో రెండు కిరసనాయిలు డబ్బాలు, ఒక ఉప్పు బస్తా, ఒక పొగాకు కట్ట, ఒక పెద్ద ట్రంకు పెట్టే వున్నాయి. వాటికి ముందుగా, వాటితో సమానమైన బరువున్న భారీ మనిషి కూర్చున్నాడు. భారీ మనిషి పేరు గురవయ్య! గురవయ్య గెడ్డాలస రాకముందు అలమండ, బోరపిల్లి, కూనేరు, గుమడ మొదలైన సంతల్లో దుకాణమేసుకు తిరిగే వ్యాపారి! ఈ సంతలు, రోజుకో చోట చొప్పున వారం రోజులా, ఆ ఏజన్సీ సరిహద్దు గ్రామాల్లో జరుగుతూంటాయి. ఈ సంతల్లో మంచి లాభాలే వచ్చేవి. కానీ పోటీ ఎక్కువగా వుండేది. అనీగాక, పార్వతీపురం

నుండి రోజుకో సంతకు సామాన్లు వేసుకు తిరగటం వలన లగేజీలకూ, ఛార్జీలకూ, సంత ఆశీలకు, వాళ్ల వీళ్ల మామూళ్లకు పోగా మిగిలేది తక్కువే అన్పించేది గురవయ్యకు !

ఇలా, అన్పించిన గురవయ్యకు గుమడ సంతలో పరిచయ మయ్యాడు బాగన్న ! గెడ్డొలస, ఆ చుట్టూ వలసల పచ్చని పంట పొలాలూ, పోడు పంటలూ, అడివిలోని అకూ, రేసా గురవయ్యలో ఆశలు రేకిత్తించాయి. అంతే. ఓ రోజు తెల్లవారేసరికి గెడ్డొలస బాగన్న ఇంటి ముందు నిల్చున్నాడు. చేతిలో కంపెనీ బనియను ఒకటీ, అలమంద పొగాకు రెమ్మలు రెండూ, ఓ అగ్గిపెట్టే వున్నాయి !

బాగన్న యింటి ముందు నిల్చొని—

"బాగన్నా ! బాగన్నా !" అని పిల్చాడు గురవయ్య !

బాగన్న యింట్లోంచి బయటికొచ్చాడు. ఎదురుగా గురవయ్య కన్పించాడు.

"ఇదేటి బావ్ ? తెల్లారగట్ల పారొచ్చినావ్. యేటి కావాలేటి సావుకారి బావ్ ?" అని ఆశ్చర్యపోతూ, అడిగాడు.

"యివందుకో...." అని చేతిలోనివి అందించాడు గురవయ్య. వాట్ని అనుమానంగా అందుకొంటూ—

"ఇవేల సావుకారి బావ్ ?" అని అడిగాడు బాగన్న.

"యికనించీ, సావుకారి బావ్, గీవుకారిబావ్ అనకుమీ మల్లి. మనిద్దరం యీ పొద్దుటికాంచి నేస్తాలం. నేస్తరికం కట్టేసినాం. అందికే, నా నేస్తానికి అవి బహుమానాలు...." అన్నాడు సావుకారి సంతోషంగా !

బాగన్న పొంగిపోయాడు. సావుకారి నేనా మంచోడు అనుకున్నాడు. యింత మంచోడు నేస్తమయినందుకు ఆనందాన్ని ఆపుకోలేక

పోయాడు. వాలసోల్లందరినీ పిల్చాడు. ఒరేసోమ్రా, భీమ్రా, బియ్యా.... రండ్రా, రండి—అని పేరు పేరునా అందర్నీ పిల్చాడు.

"ఇకబట్టి, యిదిగీ సావుకారిబావ్ మనకి నేస్తం ! మనందరిమీ యీ నేస్తానికి సాయిం జెయ్యాల.ఇకబట్టి మనం సరుకమ్మినా,కొనుక్కున్నా యిదిగీ నేస్తం తోటే సెయ్యాల ! యేటంతారు ?" అని తన పిలుపుకు చేరిన వారిని అడిగాడు బూగన్న.

"అలగలగే...." అని అంతా అంగీకారం తెల్పారు.

అదిగో, అలా గెడ్డొలస ప్రవేశించిన గురవయ్య వలసలో చిల్లర కొట్టు పెట్టాడు. వాకమల్లా వలసలోనే వుంటున్నాడు. మధ్యలో ఒకటీ రెండుసార్లు మాత్రం పట్నం లోగల తన స్వంత యింటికెల్లి వస్తుంటాడు. వెళ్లినప్పుడు వలసలలో కొన్న దినుసుల్ని పట్టుకుపోయి, పట్నంలో అమ్మేసి; అట్నించి కొండజాతి జనుల కవసరమయిన సరుకుల్ని తెస్తుంటాడు.

వెళ్లినపుడూ, వచ్చినపుడూ గెడ్డొలస నుండి అయిదు కిలోమీటర్ల దూరానగల గుమడ బస్సు రోడ్డుకి....బూగన్న గూడుబండిని ఉపయోగిస్తాడు. ఇందుకు గురవయ్య బూగన్న కిచ్చే కిరాయి వెళ్లేటపుడు అలమండ పొగాకు రెమ్మ. వచ్చేటపుడు పట్నంలో పాకమేసిన కజ్జి వుండ ! అదే భాగ్యమని అందుకుంటూ,నేస్తానికి బండిపూసే బూగన్న: పట్నం బస్సులో గుమడ రోడ్డు దగ్గర దిగిన సావుకార్ని, సామాన్లనీ గూడుబండిలో ఎక్కించి వలస దారిపట్టాడు !

కోడెలు పరుగూ నడకన వెల్తున్నాయి. ఒత్తుగా గడ్డిపరిచిన గూడు బండిలో గురవయ్యకు కుదుపు తెలికుండా వెల్తోంది బండి !

"బూగన్నా...." పిల్చాడు సావుకారి.

"యేటి సావుకారి బావ్ ? బండాపాలేటి బావ్ ?" అడిగాడు బూగన్న.

"యిదేం బాగాలేదు బూగన్నా" అన్నాడు సావుకారి.

"యేటి ? యేటేటి బావ్ ?" ఆందోళనగా అడిగాడు కోడెలను నెమ్మదిస్తూ బూగన్న.

"అదే ! ఆ బావ్‌లా, గివ్‌లా బాగోలేవు."

"ఓ"....యిదేనా అన్నట్లుగా నవ్వేస్తూ

"యేటో అనుకున్నా...." అన్నాడు బూగన్న !

అప్పుడు—

"కాదుగానీ, కడ్రకోడు మాటయేటి తేల్సినావు గాదు నేస్తం...." అని అడిగాడు సావుకారి.

"తేల్సడంకేటున్నాది...."బావ్ అనబోయి, సావుకారి అలా అనటం బాగోలేదనటం గుర్తొచ్చి ఆపేసాడు." సింతలు సెల్లిపోయినాయి. అల్లపుడెపుడో అగ్గురోరం (అగ్రహారం) దాసు బాబుకి బాకీ అట ! ఆ బాబు లాక్కున్నాడు. రొండు మేకలుండీ వంతే. ఒకటి వరద గొడ్డేసింది. ఒకటి యీనలేక సచ్చింది. వోడు వంటల్రానీ....తేబద్దుం!" అని సర్ది చెప్పాడు బూగన్న.

"నువ్వా అలగనేత్తే ఎలాగనేస్తం? కడ్రకోడు సూత్తే మాకానోడు. కనబడిన సావుకారి కాడల్లా ఓడేత్తాడు అప్పులు ! తిరిగి తీర్చవాలనొచ్చి నపుడు మరి అవుపడడు (కనపడడు). దాసు బాబు దోతరిఫీ చెయ్యిగల్డు గనక వాసూలు జేసుకుండు. మర్నాలాటోల్లు ఆడిసుట్టూ తిరగటమే మిగల్తంది.

నిన్ను నమ్ముకొనొచ్చాను. సంతలేపారాలు జేసుకొని సంపాదించీ వోడ్నీ, సల్లగుండీవోడ్నీ ! నీ నేస్తరికం గట్నాను. ఇదిగీ కొండలు పట్నాను. పెళ్లం, పిల్లల్నొదిలేసి, ఊరుగానూరు అడివిలో కొచ్చేసినాను. నాకన్నేయం జేత్తారా ?" అని అడిగాడు గురవయ్య సావుకారి.

"అదేటలగంతావు నేస్తం ? సవరోడు సత్తే గోసి గుడ్డతోటి సత్తాడు గానీ అప్పుతోటి సవ్వడు...."

"మీకు అప్పిచ్చి: మీ సావుని కోరమనంతా వేటయితే ?"

"అదిగాదది గాదు ! సెప్పొచ్చిదేటంతే, నీ బాకీ ఎటూపోదు. నీ కాలకాడకి తెచ్చి తీరుత్తాడు కద్రకోడుగానీ, పువ్వులోడుగానీ, మరోడు గానీ....సవరో దెవుడయినా. నీకా బెంగొద్దు. ఈ నేస్తాన్ని నమ్మి వొచ్చినందుకు నువ్వు సెడిపోతే.... నీ నొప్పకుంతానేటి ?" అని తిరిగి ప్రశ్నించాడు బూగన్న.

"మరదా నమ్మకంతోటే, నిన్నడుగుతున్నాను. కద్రకోడి సంగతి తేల్సమని" అన్నాడు మళ్ళీ గురవయ్య సావుకారి.

"సెప్పానుగాదా, అది పరిస్థితి. మరినువ్వే సెప్పయితే యేటి సెయ్యిమంతావో ?" అని అడిగాడు బూగన్న.

అపుడు గురవయ్య నానుస్తూ—

"ఆడి చిట్టా చూస్తే మూడొందల్దాకే మూలుగుతుంది. యిదిగీ సీజనుకాంచి రడీ అయిపోతాడు....తిండికేట్లేదనీ, పండుక్కనీ, పున్నానికనీ యిలాగ పదీ పాతికా ఒట్టుకుపోతుంతాడు. ఊర్లోని మనుసులు కష్ట బాదల్లున్నారు. సావుకార్ని వున్నాను గదా అని నాకాడకొచ్చి నోలికి—లేవు, ఎలిపోండి — అనీడం బాగుంటాదేటిబాగోదుగదా! దుకాణమెట్టి కూకున్నోడని: ఉప్పు గడ్డె అనుకో....అరువడిగితే లేదనీడం బాగుంతాదేటి ? బాగోదు గదా.

మరాయిధంగా, యీ ఊరందరికీ కష్టం కాడ సుకం కాడ, మంచికాడ, సెడ్డ కాడ, ఉన్ననాడు లేనినాడూ సూసుకొస్తన్నాను. సూసుకొస్తన్నా నంతావా ? లేదంతావా ? నువ్వే సెప్పి నేస్తం....?" అని, చెప్పమన్నాడు.

"ఎంతమాట ! ఎలాగనేదనీగలం బావ్ ? అదేం మాటనే బావ్...." అన్నాడు బూగన్న.

"మరా మర్యాదుంచుకున్నాడు గాదు కద్రకోడు. మూడు పంటల కాంచీ బాధలే సెప్తండుగానీ, బాకీ తీర్చకంటండు. అలాగ, బాకీ వద్దు

పుస్తకంలుంతే మట్టుగేటి లాభం ? వొడ్డీపడిపోదా ? అందికని, నీనొక మాటంతాను నేస్తం...." అన్నాడు సావుకారి.

"యేటిబావ్....?" అడిగాడు బూగన్న.

"అదిగోటి మల్ల....బావ్, గీవ్...." కోపడ్డాడు సావుకారి. బూగన్న అందుకు నవ్వేశాడు. అప్పుడు—

"మరేల్లేదు, పువ్వుల సన్నాసిగోడు బాకీ కింద పోతులజ్జెత అప్పజెప్పేసినాడు. ఎప్పుడి కాంచో ఉయ్యికోడు ఆపనీ యీపనీ, చేసుకొని నాకాడే తిరగతన్నాడు. ఎకరో సకరో భూమి కొనిత్తే: అదిగా పోతులజ్జెత తోటి, ఆ భూమి మీద యవసాయం జెయ్యడానికి ఉయ్యి కోడెలాగూ ఉన్నాడు గదా అని అనుకుంతన్నాను...." అన్నాడు గురవయ్య. యింకా అసలు విషయం మర్మంగానే వుంచుతూ.

"బాగున్నాది- మంచిదే ఆపని...." అని అమాయకంగానే బదులిచ్చాడు నాగన్న.

"యిదిగో కద్రకోడు సూత్తే అందరికాడ అప్పులోడేసి పీకల్దాక మునిగిపోనాడు. యీనాడు అప్పులు తీర్సడమూ, అమ్మోరికి పిల్లలు బుట్టడమూ జరగని పని. అందుకని ఆడికి కారిమళ్లు రెండున్నాయి గావా, అవి క్రయంజేసుకుంతేసరిపోద్ది....గదా...." అనిచెప్పాడు అసలు విషయాన్ని సావుకారి.

బూగన్నకో క్షణం నోరు పెగల్లేదు. యేమనటమో అర్థంకాలేదు. మౌనంగా గోర్జితోవ చూడసాగాడు.

బూగన్న మౌనంలో సంశయాన్ని పసిగట్టిన సావుకారి—

"ఆడి భూమి మీద బాబక్రం (ఆశ) తోటి యీ మాటన్లేదు. అప్పు జూస్తే వొడ్డిమీదవొడ్డీ యేటకేటా పడిపోతుంది. ఆడుజూత్తే కష్టబాదల్ల వున్నాడు. ఆ రెండు మళ్ళూ ధరకట్టేసి క్రెయిం జేసుకుందుం. నాకక్కర్లేదు ఆడి సొమ్ము. కరనంకి కవురెడుదుం. రేటు లెక్కేయిద్దుం. అప్పు

పోను వొంటా యేబయి ఆడికె త్తే యిచ్చేద్దుం. అదిగా డబ్బుల్తోటి ఆడికీ బాధలొడ్డెక్కుతాయి. నా అప్పూ తీరిపోద్ది. యేటంతావు ?" అనిసబబయిన మార్గమిదే అన్నట్లుగా మాట్లాడాడు.

అందుకు మారు జవాబు చెప్పలేక

"పరలగే కాని బావ్-సెప్తాను ఆడికి" అన్నాడు బూగన్న.

"అదిగోమల్ల.... బావ్, గివ్ అంటున్నావు.." చిరు కోపంగా అన్నాడు గురవయ్య సావుకారి.

ఈసారి ఆ మాటకు ముందులా నవ్వలేకపోయాడు బూగన్న. మౌనం వహించాడు.

గూడుబండి గెడ్డొలసలోకి ప్రవేశించింది !

అలా బండి పోతులూ,బూఁవులూ సంపాదించిన గురవయ్యసావు కారి ఒక వంచవర్ష ప్రజాళికకు సవర గూడల్లో సగం భూమికి యజమా నయ్యాడు. చిల్లర కొట్టు దుకాణాన్ని భర్తపోయి యిల్లు జేరిన అప్పజెల్లెలి కప్ప జెప్పాడు.

అప్పులూ సప్పులూ, అమర్చుకున్న భూముల వ్యవసాయం తను చూడసాగాడు. ఇంకోవైపు, యేజన్సీలో గల కొండగెడ్డలూ చిన్న చిన్న కాల్వలపై ప్రభుత్వం చేపట్టిన చిన్నతరహా నీటి పారుదల సౌకర్యాల కాంట్రాక్టులన్నీ తానే సంపాదించాడు.

యిప్పుడు గురవయ్య మామూలు సావుకారి కాదు, కాంట్రాక్టరు. కాంట్రాక్టరే కాదు భూములున్న బుగత. భూములున్న బుగతే గాదు, పలుకుబడి గల రాజకీయవేత్త ! సవర గూడల్లో గల వోటర్లంతా గురవయ్య సుద్దమన్న గుర్తుమీదే వోటుముద్ర గుద్దుతారు. ఫారెస్టాఫీసర్లూ, కార్పొరేషనువారూ, పోలీసువారూ ఒకరేమిటి ప్రభుత్వాధికార్లంతా గురవయ్య చేతి మనుషుల్లా మెసులుకుంటారు.

ఈ రకంగా మకుటం లేని మహారాజులా కొండల్లో ఎదిగిపోయిన

గురవయ్య సావుకారి గెద్దొలసలో రెండు డాబా ఇళ్లతో, వాటిలో ఇనప్పెరువాలూ, వాటి నిండా దస్తావేజులూ, నోట్లూ, బంగారాలతో వర్ధిల్లు తున్నాడు. ఆ డాబా యిళ్ల ముందు, సావుకారి నాటిన వేపకొమ్మ.... పెరిగి పెద్దదై, అమ్మోరు చెట్టయి సవర్ల పూజలందుకుంటోంది.

ఓ రోజు.. ఆ అమ్మోరు చెట్టు వద్ద పూజ జేస్తున్నాడుబూగన్న ! ఇంతలో పెను శబ్దం విన్పించింది.

బూగన్న యిప్పమాను మడిలో వేరుశనగ పంట వేసాడు. వాట్ని అడివిపందులూ, బంట్లూ పడి నాశనం జేస్తున్నాయి. ఇలా పందులో, ఎలుగుబంట్లో పడి పంటలు పాడుజేస్తే. ....చేలల్లోన నాటుబాంబులు పెట్టడం సవర రైతుల కలవాటు. జంతువులు భూమిలోకి తుట్టైదూర్చి, పళ్లతోటి కరిచి మొక్కని పీకినపుడు ఆ పళ్ల మధ్య బాంబు పడేట్లుగా .... చేలల్లో బాంబులు పెడతారు. పంట మొక్క గావాల అనుకొని మొక్కను కొరికే జంతువు నోటిలో యీ బాంబులు పేలి జంతువు చస్తుంది.

చేతి సంచిలో నాటు బాంబులు నింపుకొని బూగన్న పెద్దకొడుకు యిప్పమాను మడి దగ్గరకెల్లాడు. మడిలో బాంబుల్ని జంతువు అలవాటు పడ్డ చోటల్లో పెట్టాలను కున్నాడు.

కానీ అప్పటికే మడిలో పందుల అలికిడి విన్పించింది. వాట్ని జూసి, కోపంతో కేకేస్తూ ఆత్, ఆత్ అని చేతులెత్తి అదరబోయాడు. అదే అతని ప్రాణం తీస్సింది. బూగన్న బతుకు బుగ్గి జేస్సింది. సంచీ ఎత్తీ దించటంతో జరిగిన రాపిడి వల్ల సంచీలోని బాంబులన్నీ కలిపి పెనుశబ్దంతో పేలి పోయాయి. సంచీతో చేతిని శరీరంలోంచి వేరు జేసి మడిలోకి విసిరేసాయి. ప్రాణం పెనుకేకతో పోయింది !

పూజ చేస్తున్న బూగన్నకి శబ్దం .... ఆశ్చర్యాన్నిసింది. వలసోళ్లూ యీ శబ్దానికి .... శబ్దం వచ్చిన పైపు పరుగెత్తారు. బూగన్న గూడా

వారితో అటు వెళ్ళాడు. యిప్పయూను మడి చేరాడు. కనబడ్డ దృశ్యం బూగన్నను మూగవాణ్ణి జేసింది.

పిచ్చిగా, మౌనంగా కొడుకు శరీరాన్నంతట్నీ చేతుల్తో తడుముతూ, కన్నీటి ధారల్తో కడుగుతూ.... ఎప్పటికో మొహం ఎత్తాడు. నోరు పెగిల్చాడు. పెగిల్చి, నిల్చున్న జనంతో—

"సూడండర్రా ! సూడండి ! జాకర్దేవత బూగన్న కడుపుల అగ్గి పెట్టేసింది. సెట్టంత కొడుకుని ఎత్తి కెలిపోనాది. నా కుడిభుజాన్ని కూలకేస్సింది.

తల్లి, జాకర్దేవ తల్లి ! నీకేటి తక్కువ జేసాను ? నాకెందుకీ కడుపు కోత పెట్టావు. సెప్పుతల్లి.... సెప్పు...." అని రెండు చేతుల్తో కొండల్ని మొక్కుతూ, ప్రశ్నిస్తూ రోదించసాగాడు.

తమ కందరికీ పెద్దయిన సామంతు బూగన్నే యిలా పసిపిల్లాడిలా యేడ్చేసరికి గెడ్డాల సోల్లంపరికీ మరింత దిగులైంది. అందర్లోకీ కాస్తా ముదరోడు ముందు తేరుకొని—

"లెగు, లెగు బూగన్నా. యెంతేడిత్తే మటుగేటి.... కొండబోయిన (చనిపోయిన) కొడుకొత్తాడేటి? అడికీ పొద్దుటితోటి భూమ్మీద నూకలు సరి. అందికే ఎలిపోనాడు లెగు, లెగు నవరోడికి దిన దిగ గండం యీ అడివిల ! ఊరిపెద్దవి నువ్వే యిలగైపోతే ఎలాగ? లెగిసీ, సెయ్యాలిసిన పనులు పురమాయింపు" అన్నాడు.

బూగన్న తేరుకొని... లేచి; శవాన్ని ఇంటికి పట్టించుకెల్లాడు. గురవయ్య సావుకారి యీ వార్తవిని అయ్యో అనే శబ్దాన్ని ఉచ్చరించి, యేదో పనిమీద వలసనుండి పట్నం వెళ్ళాడు. తిరిగొచ్చేసరికి మధ్యాహ్నమైంది. తిన్నగా బూగన్న ఇంటికి వెళ్ళాడు.

అప్పటికి శవదహనం జరిగిపోయింది. రాత్రికి పురమెత్తే యేర్పాట్లలో వున్నారు బూగన్నా, బంధువులూ !

గురవయ్య రాకతో బూగన్న యింటి దగ్గర గూడిన జనమంతా సావుకారుబావొచ్చాడు... సావుకారిబావ్—అని మర్యాద చేయబోతుంటే, వార్ని ఆపి; బూగన్నని పరామర్శించాడు గురవయ్య బూగన్న సావుకార్ని పట్టుకొని యేడ్వసాగాడు.

"అదేటి నేస్తం! చిన్న పిల్లడివై పోతన్నావు! నువ్వెరగని సావులా? బతుకులా? ఛ.ఛ... ఊరుకో, ఊరుకో! కార్యానికేటి కావా లంతే నన్నడుగు. అనుమానపడకు. యిదిగి వొంద రూపాయిలుంచు. తర్వాతిచ్చిద్దువులే. డబ్బుకేటి? ముందు కార్యం జరిపించు..." అని బూగన్ననోదార్చి; పురమెత్తే కార్యానికి వందరూపాయలు అప్పిచ్చి గురవయ్య సావుకారి యింటి కొచ్చేసాడు.

షావుకారిచ్చిన వంద రూపాయలూ, చిల్లర కొట్టుమీద సరుకులూ అరువు తీసుకొని, ఆ రాత్రి పురమెత్తే కార్యక్రమానికి వంటలు చేయిస్తు న్నాడు బూగన్న!

సాయంత్రానికి వలసోళ్లంతా బూగన్న పెరట్లో వున్నారు. గునపాం పొయ్యిల మీద బియ్యం ఎసర్లు ఉడుకుతున్నాయి. తలా ఓ పని జేస్తూ, చనిపోయిన వాడి మంచితనాన్ని ముచ్చటించుతున్నారు బంధువులు. ఇంట్లో ఆడవాళ్లు ముక్కులు చీదుకుంటూ యేడుస్తున్నారు. హృదయాంతరాలల్లో కన్నప్రేమ దహిస్తోంటే... కట్టెలాగా తిరుగాడు తున్నాడు బూగన్న... అటూయిటూ!

ఆ సాయంత్రం వేళ... గెడ్డొలసలోకి రెండు సైకిల్లొచ్చాయి. ఆ రెండు సైకిల్లూ బూగన్న ఇంటి ముందాగాయి. రెండు శరీరాలు దిగాయి! రెండు శరీరాలూ ఖాకీ దుస్తులు ధరించాయి. ఎర్రటోపీలు బుర్రల మీదా, లాఠీలు చేతిలో ధరించాయి.

జమాన్లొచ్చారు, జమాన్లు అని జనం ఆందోళనగా బూగన్నకు చెప్పారు!

జవాన్లులో ఒకాయన—

"బూగన్న ఎవుడ్రా ?" అని అడిగాడు జనాంతికంగా.

"నినే బావ్...." అన్నాడు బూగన్న ముందుకొచ్చి.

"నువ్వా, పద ఠేసన్కి...." పోలీస్.

"ఠేసినీ కా ? ఎందుకు ?"

"నీ కొడుకుని సంపేసినందుకు."

"ఆఁ !" అంటూ, బూగన్న గుండె గబగబా కొట్టుకుంది.

"ఆఁ ! యేట్రా ? నీ కొడుకు సచ్చాడా ? లేదా ? బాంబు పేలి సచ్చాడా ? లేదా ? మరలగ ఆశ్చర్యపోతావేటిరా ?" అని గసిరారు పోలీసు వారు.

"కొడుకు సచ్చినందుకు నే నేడుత్తుంతే, మీరొచ్చి ఠేసినీకి రమ్మంతే ఆశ్చిర్యమెయ్యదా ?" అనడిగాడు బూగన్న.

"ఎందుకెయ్యదూ, యేస్తాది ! మాకూ యేస్తాది. పొద్దుటి దాక గుండు ముక్కలాగున్న మనిషి పొద్దుబోయేసరికి కాష్టంలో కాలిపోయాడంటే మాకూ ఆశ్చర్యమేస్తుంది. ఎవుడాడి ప్రాణాలు దీస్సాడా ? అని అనుమానమూ యేస్తుంది." అన్నారు పోలీసు వారు.

"ఆ జాకర్దేవతే తీస్సింది. నా ఇంటి దీప మార్పేసింది." అన్నాడు బాధగా బూగన్న.

"బాగా అన్నావు.... గానీ, నీలాగ దేవత మీద తోసీడంకి మీము కొండోలిమి గాము, పోలీసోలిమి ! దెయ్యాల మీద, దేవతల మీదా కేసులెడితే యిక మరి జెప్పకు. యిప్పుడికే మా డిపాట్మెంటు పరువు యిలగేడుత్తంది...." అని; కేసు మనుషుల మీదే పెడతాం తప్ప దెయ్యాల మీదా, దేవతల మీదా పెట్టము అని చెప్పారు పోలీసు వారు.

చనిపోయిన ఫలానా వ్యక్తి మరణం పట్ల అనుమానాన్ని వ్యక్తం చేస్తూ; అందుకు అనుమానితుడిగా బూగన్నను కస్టడీలోకి తీసుకుంటున్నా

మని చెప్పారు. జైకిల్ వెనుక కేరేజీకి కట్టిన సంకెళ్లను తీసి బూగన్న చేతులకు వేశారు.

గెడ్డాల సొక్క సారిగా చిన్నబోయింది. తమ సామంతునే బందీ చేయటంతో బావురుమన్నారంతా ! పోలీసుల కాళ్లమీదపడి వేడుకున్నారు. -అట్టే అల్లరిచేస్తే ఊరు, ఊరందర్నీ మూసేస్తామని పోలీసులు హెచ్చరించారు. అదిగో, అప్పుడొచ్చాడక్కడికి గురవయ్య సావుకారి !

పోలీసోళ్ళి పలకరించాడు గురవయ్య. వలసోల్లు సావుకారి చుట్టూ చేరి బ్రతిమాల సాగారు. గురవయ్య అంతా గమనించి, యేం ఫరవా లేదు.... అన్నట్లుగా వలసవారివైపు చూసి తల అడిస్తూ; పోలీసు లిద్దరినీ అక్కడ్నుండి కొద్ది దూరం తీసుకెల్లి కొంతసేపు గుసగుసలాడాడు. తిరిగొచ్చి బూగన్నని యింకోవైపు తీసుకెల్లి చెవిలో—

"సూడు నేస్తం ! కాలం మన్ది కానపుడు కర్ర పామయి కరుత్తాది. కొడుకు సచ్చినందుకు నువ్వేడుత్తుంతే.... బాంబు పేలటం, సావటంతోటి పోలీసోడికి కేసయ్యింది. అలుగానీ మర్డరని కేసెడితే ఊరు, ఊరంతా మసయి పోద్ది ! యేదో తెలిసిన జమాన్లు గనక బతిమాల్నాను. కొంత మెత్తబడ్నారు. వెయ్యి రూపాయి లియ్య మంతన్నారు." అని చెప్పాడు.

"ఓర్నాయిన ! యిదేటీ గోరం ? నీ నేటి నేరం చెయ్యలేదు.... డబ్బిచ్చుకోడంకి. చేతికందిన కొడుకే చెల్లిపోనాడు. యిక. నాకు యిసార మేటి ? యిక్కడున్నా ఒకిటే, జెయిల్లున్నా ఒకిటే ! ఎయ్యి రూపాయిలు నీ నెక్కడ్నుండి తెత్తాను ? నీ నిచ్చుకోను." అని తెగేసి చెప్పాడు బూగన్న.

"నీ ఒక్కడితోటి తేలిపోద్దేటి ? కూనీ కేసంతన్నారు. ఊరందరికీ సుడతారు. నీ నుండి ఊరందరూ కేసుల పాలయి, జెయిలుకెల్లం బాగుంతాదేటి ? ఊరు పెద్దవీ, సామంతువి ! నీ గౌరవమేటుంతాది ? ఊరో లేటనుకుంతారు ?" అని ఊరి ప్రజలవైపు నుండి సమస్యను చుట్టుకొచ్చాడు సావుకారి !

బూగన్న ఆలోచనలో పడ్డాడు. వలసవైపూ, తన జనం వైపూ చూసాడు. అప్పుడు సావుకారి—

"డబ్బు గురించి ఆలోసించకు. నీనున్నాను. యీ ఆపద గటెక్కనీ, తరాత సూసుకోవచ్చు....డబ్బు లెక్కలు" అని హామీ నిచ్చాడు.

అప్పుడు బూగన్న—

"కానీ, యెంతకో కొంతకి తెగదీస్సి, అల్లని తగిలే." అని పోలీసుల వైపు చూస్తుతూ అన్నాడు!

"అలగన్నావు బాగుంది. ఇక నువ్వు నిమ్మలంగుండు. కార్యం జరిపించుకో. అల్ల సంగతి నీను చూసుకుంతాను." అని సావుకారి పోలీసుల దగ్గరకొచ్చి, వాళ్లచేత బూగన్నకు వేసిన సంకెళ్లు విప్పించేసి; పోలీసుల్ని దీసుకొని యింటివైపు వెళ్లాడు.

పోలీసోళ్లతో యింట్లో కొంత సేపు మంతనాలు జరిగాయి. తర్వాత పోలీసులు నవ్వుతూ, బయటికొచ్చి సైకిల్లెక్కుతూ—

"గురవయ్యా సావుకారీ! నువ్వు గుండెలు తీసిన బంటువి!" అన్నారు.

ఆ మాటలో దూషణ శబ్దం రాలేదు. పొగడ్తలా ధ్వనించింది. దొంగలు గజదొంగని పొగిడినట్లన్పించింది. బలిసిన ఉల్లి బాములా నవ్వేస్తూ.... గురవయ్య సావుకారి యింట్లోకి వెళ్లిపోయాడు. పోలీస్ సైకిళ్లు పోలీసు స్టేషన్ వైపు వెళ్లిపోయాయి.

ఆ తర్వాత, పదిరోజులకు బూగన్న కోడెలు, గూడుబండీ గురవయ్య యింటికొచ్చేసాయి!

"నీ దగ్గిరుంతేటి? నా దగ్గిరుంతేటి? బూగన్నా! నా కవుసర మొత్తే నువ్వు బండి పూసేవోడివి గాదా? అప్పు నీ మీదుండి పోయి, దానికి వాడ్డీలు పెంచుకునీ బదులు యిదే మంచిది, నీ అప్పు తీరిపోతంది!

నీకు కావల్సినపుడల్లా యీ బండీ, ఎడ్లూ తోలుకెల్లు. కాదంతే, నన్నడుగు. నీ సాల్లోని పశివిలే అనుకో. అనుమాన మెట్టుకోకు. అదిగాక,

నీ కోడెలు మరెవులికి యింతాయా, యేటి ? నువ్వే వుండాల అటి తోటి పనికి ! అందికనీ, బండీ బక్కాలూ అప్పుకింద నాక్కున్నాననుకోకు. నా దగ్గిరున్నా....యివి నీవే !" అంటూ: చావు ఖర్చుకీ, పోలీసు కేసు మాఫీకీ యిచ్చిన అప్పుకిందా....బండీ, కోడెలు వుంచుకున్నాడు గురవయ్య సావుకారి.

సావుకారి మాట వరసకి అన్నాడేగానీ, పనీపాట్లకి బండీ ఎడ్లు అడగలేక పోయాడు బూగన్న. గత్తం పెరకవలకీ, దుక్కులకి ఎంతో బాధపడే వోడు. వాళ్లవీ, వీళ్లవీ కూలికి తెచ్చేవాడు. అంతంతగానే సాగింది వ్యవసాయం ఆ సంవత్సరం ! ఆ మరుసటి సంవత్సరం చిన్న కొడుక్కి పెళ్లి చేసాడు. పెళ్లికి యేడు వందలుదాకా అప్పు వాడాడు సావుకారి దగ్గర.

మరోయేడాది పోయీసరికి: పెళ్లికి చేసిన అప్పుకి తోడు: వ్యవసాయం మదుపులకి వాడిన అప్పూ కలిపి పల్లపు భూమి రెండున్నర ఎకరాల్నూ పోగొట్టాయి. సావుకారి పేర క్రయం జేయించాయి. పోడూ-మెట్టా భూమితో మిగిలాడు బూగన్న.

సాలలో కోడెలు సావుకారి పరమైనాయి. చేతి కందిన పెద్ద కొడుకు చెల్లిపోనాడు. ఉన్న భూమి అప్పుకింద అమరక మయిపోయింది. బతుకుపోరాటంలో ఒకటొకటిగా పోగా, బితుకు బితుకు మంటూ మిగిలాడు బూగన్న.

గతంలో లా-తానీ వలసకి సామంతుననీ, తన మాటే వలసకి బాట కావాలనీ- అనుకోవటం లేదు. దిగాలుగా దినాలు నెట్టుకొస్తున్నాడు.

వలసోల్లలో గూడా మార్పొచ్చింది. ఇంతకు ముందులా సామంతుని సంప్రదించటం లేదు.... యే విషయంలోనూ ! ఎవరికి నచ్చిన తీరులో వారు పోతున్నారు. అప్పుడప్పుడూ గురవయ్య సావుకారికీ, వలసోల్లకీ మధ్య బాకీలకాడ, సరుకుల అమ్మకము కొనుగోలు కాడ ఘర్షణలొస్తున్నాయి. సావుకారి యింతకు ముందులా- నేస్తం ? నువ్వు

తేల్సి సెప్పవా ?— అని బూగన్నని అడఆగటం లేదు. అతనే తేల్చు కుంటున్నాడు.

ఒకసారి చాలా పెద్ద గొడవే జరిగింది.

గెడ్డొల సోలందరికీ పోడు మీద పెద్ద కందులు బాగాపండాయి. గుమడ సంతలో మంచి ధర పలుకుతోంది. కానీ సావుకారి కానియ్యటం లేదు. అడ్డు పడుతున్నాడు.

"పోడు పండనీ, పోడుపండనీ అని యిన్నాళ్లూ సెప్పి, యిపుడేమో యీపని జేత్తారా ?" అని కోపంతో రేకలేసాడు సావుకారి.

"ఏమపని....?" వలసోలు అడిగారు.

"సంతలకి బట్టకెలిపోటం...."

"మన్నివ్వు అడ్డకి పద్దడు కూరిసిద్దమంతే ఎలాగ? రెక్కలిరుసు కొని మొక్కల్ని పెంచాము."

"మీరు రెక్కలిరిసి పెంచితే; నీనేటి సెట్టు దులిపేసి తేలేదు రూపాయలు సులువుగా !"

"నువ్వు సెటే దులిపి తెచ్చావో, సెవటే కారిసి తెచ్చావో మాకేల నీ రూపాయిలూసు ? మా పంట-మా యిష్ట మొచ్చిన కాడ అమ్ము కుంతాం...."

"మరా్న బాకీ ఎగమెడ్డుతారేట్రా ?"

"కందులమ్మేసి.... అ డబ్బులు తెచ్చితీరుత్తాం !"

"మీకు కందులు కండన కింద అప్పులిచ్చాను గానీ; నా రూపాయిలే నాకు తిరిగెమ్మని కాదు." అన్నాడు సావుకారి.

వలసోల్లలో నిలబడ్డ పువ్వాల సన్యాసి కోపంతో ఊగిపోయాడు. బాకీ కింద ముట్టమొదటగా పోతుల జత పోగొట్టు కున్నాడు. కండన అప్పుల మోసాన్ని నిరశిస్తూ—

"నీ కండన అప్పులే మా కొండోళ్లని మాపిసినాయి. పోడు మీద

మొక్కకీ, మడిలోని చేనుకీ, సెట్టు మీది కాయకీ అన్నిటికీ యెసరెట్టేసి నావు. ఉరులు సుట్టేసి మమ్మల్ని యేటాడీసినావు. నీ యేటికి వొలసోలంతా అమిరిపోయి యిదిగిలాగ మిగిల్నాము. గుడ్డీ, మడీ, బండీ, బక్కాపోయి నీ కంబార్లమయినాము. ఇంకా సాల్దా ? ఇంకా మమ్మల్నొదలవా ?" అనడిగాడు.

"ఓరె ! ఓరోరె ! ఎంతేంత మాటలంతన్నావురా ? నీను ఉరులు యేసినానా ? మిమ్మల్ని పాడు చేసినానా ? పట్నంల హాయిగుండీవోడ్ని. సంతలేపారంతోటి కడుపులో సల్ల కదల కుండా బతికీవోడ్ని. యీ కొండలు పట్టిసినాను. యీ అడివిల అడ్డమయిన పుర్రాకులూ పన్నాను." అన్నాడు సావుకారి.

"అడ్డమయిన పుర్రాకులూ నీ ఆస్తులు పెంచాయిగాని పోగొట్టీ లేదు గదా ? రొండు కిరస నూని డబ్బాలూ, ఉప్పు మూటా కటీ నిన్ను బుగతని జేసాయి. మేడలూ మిద్దెలూ తెచ్చాయి. కాన రాని సంపతతోటి కుదబలి సినావు. మర్నీ కేటి కష్టమింకా ?" అని ప్రశ్నించాడు కద్రకోడు, సావుకారి మొహమ్మీద చేతులూపుతూ.

"అయితవన్నీ నీ కిచ్చీమంతా వేట్రా ?"

"నీయంత ఆశబోతోలిమి గాము మీము...."

"ఆఁ ! ఆశ లేని దోసకాయ...."

ఇలా ఒకరికొకరు వెక్కిరించుకుంటూ, దూషించుకుంటూ చివరికి వలసోలూ, సావుకారీ ఒకర్నొకరు హెచ్చరించుకున్నారు. సరే-చూస్తాన్లే ! అని సావుకారి అంటే; చూసుకుందాములే— అని వలసోలూ!

ఈ ఘర్షణంతా, తర్వాత బూగన్నకు తెల్సింది. దీర్ఘంగా ఒక నిట్టూర్పు తీసి ఊరుకున్నాడు.

కానీ, సావుకారి ఊరుకోలేదు —

వలసోల్లు గూడా అందరూ ధృఢంగా నిలబడ్డారు. కండన అప్పులన్నిటినీ డబ్బు రూపేణా తప్ప: సరుకుల రూపేణా యివ్వగూడదని నిర్ణయించుకున్నారు. పల్లంలోనే కావలిసిన సరుకులు కొని తెచ్చుకుంటున్నారు. గురవయ్య కాతాకొట్టుని బహిష్కరించారు.

ఇదంతా గమనిస్తూ వస్తున్న సావుకారి ఓ ఆదివారం నాడు పట్నం నుండి ఆరేడుగురు గూండాల్ని వెంట తెచ్చి: గుమడలో అద్దెకు రెండు నాటు బళ్లు పూయించి సరీగ్గా గెడ్డాలసకీ, గుమడ సంతకీ మధ్య తోవలో —ఎటూ అందనిచోట కాపు గాసాడు.

వలసోళ్లు కందులు కావిడిలు మోసుకుంటూ వస్తున్నారు. ముందు కద్రకోడున్నాడు. ఆ వెనక పువ్వుల సన్నాసీ, ఆ వెనక మిగతావారూ— యిలా ఆ యిరుకు తోవలో ఒకరి వెనుక ఒకరు నడుస్తున్నారు. మరి కొంత దూరం— పది బారలు నడిస్తే— ఆ ఇరుకుతోవ బండి తోవలో కలుస్తుంది. అక్కడున్నాయి సావుకారి తెచ్చిన బళ్లు····మనుషుల్తో !

కద్రకోడు ఠక్కున నిలబడి పోనాడు. వెనక నున్న కావిళ్ళు నిలబడి పోనాయి. కద్రకోడు కావిడి భుజమ్మీంచి దించి—

“అదిగా బండి తోవల అడ్డగేవో బళ్ళున్నట్టిగుంది సూడండి” అన్నాడు. అందరూ అటు చూసారు. పువ్వుల సన్నాసి తన కావిడి దించి కొద్దిగా ముందుకెల్లి దొంకల బాటు నుంచి బండితోవ చూసి—

“సావుకారి గాడున్నాడు. ఆరేడుగురు మనుసులు కర్రలు పట్టుకోని నిలబడ్డారు” అన్నాడు.

“ఆఁ!” అంటూ ఆందోళనగా, అంతా కావిళ్ళు దించేసారు.

అప్పుడు కద్రకోడు—

“సావుకారేదేనా అంతకానికి పూనుకుంటే; అమాయికంగా అమిరి పోగూడదు. అందరిమొకలేగ నిలబడి తిరిగి దెబ్బ తియ్యాల ! సేటయి

పోద్దో అని బియపడొద్దు. యేటా ఆడి అప్పులికి పంటలొదిలేసి ఆకల్తోటి సవ్వడం కంటె పంటల్ని దక్కించుకోడం మంచిది." అన్నాడు.

అందరూ "ఔనౌను, అంతే" అన్నారు.

కన్పించిన కావిళ్ళు ఎంతకీ బండి తోవకి రాకపోవటంతో అనుమానమొచ్చిన సావుకారి, బండి మొకరం ఎక్కి నిలబడి వలస తోవ వైపు చూసాడు. చూసి—

"కొండ నా కొడుకులు, అదిగదా తోవల ఆగిపోనారు. మనల్ని సూస్సారు గావాల ! ఎనక్కి ఎలిపోగల్రు ! పదండి, పదండి. కొండ నా కొడుకుల్ని కొట్టి, ఆ కావిళ్ల నాక్కొని బండికెక్కించండి." అన్నాడు.

పట్నం నుండొచ్చిన గూండాలు కర్రలు పట్టుకొని తోవ వైపు పరుగెత్తారు కేకలేస్తూ ! బండి మనుషులు మాత్రం బళ్ళ వద్దే వుండి పోయారు— మాకెందుకీ తంటాలు ? అనుకుంటూ !

గూండాల కేకలు, పరుగులూ చూసిన వలసోళ్ళంతా కావిడి పూత లిప్పారు. కావిడి బద్దలు లాగారు. ఒక్కుమ్మడిగా గూండాల మీదికి తిరగ బడ్డారు. తమ కేకలకే వలసోళ్ళు పారిపోతారనుకున్నారు గూండాలు ! కానీ ఒక్కుమ్మడిగా కావిడి బద్దలతో తిరగబడటంతో గూండాలకు ఆశ్చర్యం వేసింది ! ఆ ఆశ్చర్యంలోంచి వారు తేరుకోకముందే వారిమీద ఒక్కుమ్మడిగా వలసోళ్ళంతా కావిడి బద్దలతో దాడి చేసారు. తమ శ్రమ ఫలం దక్కించుకోవటానికి, కావిడి బద్దలెత్తిన గిరిజనులధాటికి గూండాలు కాలికి బుద్ధి చెప్పారు. తలో దిక్కుగా గుమడ సంతకు పారిపోయారు.

గూండాలు పారిపోవడంతో, గురవయ్య సావుకారీ బెదిరిపోయి, అద్దె బళ్ళు వెనుదిప్పించి, బండిలో కూర్చొని గుమడ రోడ్డుకి వెళ్ళి పోయాడు. అక్కడ్నించి, పట్నం వెళ్ళిపోయి కొన్నాళ్ళు వుండి పోయా డక్కడ. కొండ నా కొడుకులు తెలివి మీరిపోనారు. ఇక మరి వలస

వ్యాపారం సాగదు— అని అనుకున్నాడు. అంచేత, భవిష్యత్ కార్య క్రమం గూర్చి మన్సులోనే కార్యాని ప్రణాళిక వేయసాగాడు.

*    *    *

ఒక రోజు....

అప్పుడే చీకటి కొదికొద్దిగా కొండల్లోనా, వాగుల్లోనా, గెడ్డ వలస లోనా పరుచుకుంటోంది. వేసవి కావటాన గెడ్డొలస ప్రజలు— అరు బయట నులకమంచాలమీదా, అరుగులమీదా చేరబడ్డారు.

ఇంతలో గెడ్డొలసలోకి ఆరు గూడుబళ్ళు వచ్చాయి. నేరుగా గురవయ్య సావుకారి డాబా యింటి ముందు ఆగాయి. వాటిలోంచి పది మందిదాకా సాయుధ పోలీసులూ, ఒక సబిన్స్పెక్టరూ దిగారు— గురవయ్యతో! వారితో కొంతమంది గూండాలూ దిగారు.

పోలీసుల్ని తీసుకొని గురవయ్య సావుకారి తిన్నగా సామంతు బూగన్న ఇంటికెల్లాడు. బూగన్న లేడు. పోడుమీదున్నాడు. యేటి? యేటేటి బావ్?—అని పోలీసుల్ని అడగడానికొచ్చారు—పువ్వల సన్యాసి, కద్రక సోంద్రుడు, భీము— మరో ముగ్గురు నలుగురు వలసోల్లు.

తప్పిపోయిన మేకల్ని దొరకబుచ్చుకున్న కసాయోడిలా గురవయ్య సావుకారి—

"దొరికారండీ, ఎస్సయిగారూ— వీళ్ళే, మనము వెదకాల్సినోళ్ళు. యిరుగో, యీళ్ళని అరస్టు జేయండి" అని ఎస్సయిగారికి చూపించాడు వార్ని.

పోలీసులు, పువ్వల సన్యాసినీ, కద్రకోడ్నీ, భీమునీ....దొరికి నోళ్ళని దొరికినట్లుగా పట్టుకొని: సంకెళ్ళేసి గూడుబళ్ల ఎక్కించారు. గెడ్డొలసలో జనం కకావికలయిపోయారు. అంతా పోడులమీదకీ, అడవి లోకి పారిపోసాగారు.

పోలీసులు అరెస్టుజేసిన వలసోళ్ళని గూడుబండిమీద రోడ్డువరకూ తీసుకెల్లి; అక్కడాపిన పోలీసు వ్యాన్‌లోకి వాళ్ళి ఎక్కించుకు వెళ్ళి పోయారు స్టేషన్‌కి. గూడుబళ్లు తిరిగి గెడ్డోలస చేరుకున్నాయి.

సావుకారి గురవయ్య ఇల్లు ఖాళీ చేస్తున్నాడు. ఇంట్లో బీరువాల్ని బళ్ళకెక్కిస్తున్నారు పట్నం నుండొచ్చిన గూండాలు. పొగాకు కట్ట, ఉప్పు బస్తా, కిర్సనూనె డబ్బాతో వలస వచ్చిన గురవయ్య—యివ్వాళ నోట్ల కట్టల్నీ, బంగారాన్నీ, బీరువాల్లోభద్రపరచి బళ్ళకెక్కిస్తున్నాడు. కొండనీ, కోననీ కొల్లగొట్టి కూడగట్టిన సంపదనంతా పట్నానికి తరలించుకు పోతు న్నాడు. ఆరు గూడుబళ్ళూ బరువుతో నిండిపోయాయి. గురవయ్య సంతృప్తిగా వాటి దిక్కు చూస్తూ నిల్చున్నాడు.

అప్పుడొచ్చాడు బూగన్న!

మాసిన గెడ్డం, పిలకజుత్తూ, వంగిన శరీరం, కృంగిన హృదయం—వలసోళ్ళని అరెస్టు చేసారనే వార్త కల్గించిన ఆవేశం మనిషిలో కన్పిస్తున్నాయి.

గురవయ్య సావుకారి కొద్దిగా జంకాడు. ఆలోచనలో పడ్డాడు. వీణ్ణి అరెస్టు జేయించాల్సింది. అనవసరంగా వూరుకున్నాను—అని అను కున్నాడు. అయినా, వెంటనే, అప్పటికప్పుడేదో పథకం వేసుకొని, మొహంలో కాస్తా నవ్వు పులుముకొని—

"బూగన్నా....బాగున్నావా ?" అనడిగాడు.

బూగన్న యేమీ అన్లేదు.

"బూగన్నా ! యీ వొలసకీ, నాకూ రుణం తీరిపోయింది ఎల్లి పోతన్నాను.

పదేళ్ల కిందట....నిన్ను నేస్తం అని నమ్మి వొచ్చాను. యీ పదేళ్లూ మీ వొలసోల్లలో నొకడిగానే గడిపాను. గానీ, రోజులు మారి పోనాయి. నీనేదో దోపిడీ జేసిత్త న్నాననీ, ఆస్తులు గడించుకొంతన్నాననీ

వలసోయి అంతన్నారు. నువ్వన్లేదనుకో. నీ మంచి నీతోటే వుండి పోనాది. వొలసోల్లలో మంచి లేదు. మాటకి మాట అంటున్నారు. ఈవేళ, మాట అంటన్నారు. ఉన్లే, రేపు దెబ్బ తీస్సినా తీసేత్తారు. నాకు దిక్కేటి యీ కొండల్ల? ఇప్పుడికే అటు మొండింఖిల్ల మొతా కాసి సంగం, గింగం అంతన్రాట! సంతలు దోసుకుంతన్రాట సావుకార్ల యిళ్ల మీద పడ తన్రాట!

యిది మంచి పనేనా? అని అడగను. ఎందుకంతే; ఎవులి దారి తిన్నన ఆల్లది అనే రోజులివి. అందికనీ, నా దారి నేను సూసుకోవాల కదా. భూమీ, పుట్టా కొమరాడ, గుమడ నైతులికి కొలు కిచ్చేసినాను. వలస లేపారం మరి సెయ్యలేను. బాకీ సాకీ లంతావా — వొచ్చిదొస్తాది, లేన్డి లేదు. క్రిష్ణా, రామా అనుకొని పట్నంలో గడపేత్తాను.

తొలీత వొచ్చినపుడు, నీ కోడెలా గూడుబండి మీదే వొల సొచ్చాను. అదృష్టం బాగుండి యిప్పుడూ నువ్వొచ్చావు. నీ కోడెలు .... బండి పుయ్యడానికి ఎవులికీయినవు గదా! నువ్వే పుండాల. ఆ బండి పూసి, నాకు పట్నం దిగబెట్టేవా?'' అని అడిగాడు.

''పూస్తా నారే, పూస్తాను ....'' అన్నాడు రౌద్రుడై బూగన్న.

"ఇదేం బాగాలేదు బూగన్నా...." అన్నాడు సావుకారి.

"యేటిరా....బాగులేదు...."

"అదే, ఆ వారే, గిరేలు. యేం బాగాలేదు"

అన్నాడు మళ్లీ; సావుకారి సౌమ్యంగానే.

"తొలీత, నువ్వొచ్చినపుడు బావ్, గీవ్ అని పిల్సివోడ్ని. కాదు, కాదు, అదేం బాగులేదు - నేస్తం అని పిలమనీవోడివి! నిజిమను కున్నాను. నేస్తంవే అనుకున్నాను. అమాయికంగా నమ్మేసినాను. నమ్మి: వొలస, వొలసలన్నీ నీకప్పగించేసినాను.

ఇప్పుడు నువ్వు మా మూలుగులన్నీ పీల్చేసి ఉల్లిబామునాగ పొంగి

పోనావు. మా భూమీ పుట్టనీ; పంటల్నీ, ఫలసాయాన్నీ నొల్లీసి మమ్మల్ని గోసి గుడ్డల్తో టిమిగిల్సినావు. నీ దురుమార్గపు యేపారం వొల్లగాదన్నందుకు మా వొలసోల్లని జెయిళ్లతోయించినావు.

యిప్పుడు సల్లగా, సంపాయించిన ఆస్తితోటి పట్నం ఎలిపోతావా? నీకు సాగంపాలా? బండిపుయ్యాలా? పూస్తానారే, పూస్తాను. తిన్నగా యమధర్మరాజు కాడకి నీకు బండి గడతాను...." అంటూ, ఆవేశంతో సావుకారి మీద పడ్డాడు బూగన్న!

కానీ, అప్పటికే బూగన్నని అడ్డుకున్నారు.... సావుకారి తెచ్చిన గూండాలు. తలా ఓ దెబ్బ వేసారు. కుప్పగూలి పోయాడు బూగన్న!

నిండుగా బరువుతో నిండిన గూడుబళ్లు బూగన్న మీదుగా నడిచి పోయాయి. గెడ్డొలస గుండెల మీదుగా గురవయ్య సావుకారి సంపద బళ్లు సాగిపోయాయి!

మరునాడు....

గెడ్డొలసలో సావుకారి గురవయ్య ఇంటిపై దాడిచేసిన నక్సలైట్లకూ పోలీసులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక నక్సలైటు మరణం; పదిమంది అరెస్టు — అనే వార్త, దినపత్రికల్లో చదివి - నక్సలైట్ బెడదతో ఆందోళన చెందే నాగరిక హృదయాలు కొంత సాంత్వనం పొందాయట!

★